

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : సోమవారం సా : 6.34 గం..

సహర్ : మంగళవారం ఉ : 4.54 గం..



టార్గెట్..

- ఆయావర్గాల ఓట్లపైనే అభ్యర్థుల నజర్
- ముగ్గురికి గెలుపే సవాల్‌గా ఎంపీ ఎన్నికలు
- వ్యూహ ప్రతివ్యూహాలతో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు

యువత, నిరుద్యోగ ఓటర్లే.!

మహబూబాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడింది.. ఎంపీ బరిలో నిలిచే ప్రధాన పార్టీల అభ్యర్థులనూ అధిష్ఠానాలు ప్రకటించాయి.. దీంతో గెలుపే లక్ష్యంగా రాజకీయ పార్టీలు ముందస్తు వ్యూహప్రతివ్యూహాలతో రంగంలో దిగుతున్నాయి. మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సిట్టింగ్ బీఆర్ఎస్ ఎంపీ మాలోతు కవిత మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకుంటుండగా కాంగ్రెస్ అభ్యర్థి, కేంద్రమాజీ మంత్రి పోరిక బలరాంనాయక్, బీజేపీ అభ్యర్థి, మాజీ ఎంపీ అజ్మీర సీతారాంనాయక్ ముగ్గురు ఈ నియోజకవర్గానికి సుపరిచితులే కావడంతో ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ఇప్పటికే ఒకదశలో తమకు బలమున్న ప్రాంతాలను సందర్శించి బలం, బలగమున్న నేతలను ప్రసన్నం చేసుకునే ప్రయత్నాలు చేసి వచ్చారు.

మహబూబాబాద్ పార్లమెంటరీ అవిర్భావం నుంచి వరుసగా మూడుసార్లు జరిగిన ఎన్నికల్లో ఒక్కోసారి ఒక్కొక్కరి చొప్పున ప్రాతినిధ్యం వహించి, ఉన్న ఈ అభ్యర్థులు పార్టీ సింబల్ ఓటింగ్‌కు తోడు వ్యక్తిగతంగా ఓటరును ఆకట్టుకునే దిశగా వివిధ సామాజికవర్గాలను కలుసుకుంటున్నారు. ముగ్గురు గిరిజన బంజార సామాజికవర్గం నుంచే ఉండడంతో ఆదివాసీల ఓట్లను ఆకర్షించేందుకు సంబంధిత వర్గ ముఖ్యులతో భేటీలు నిర్వహించుకుంటూ, మద్దతు ఇవ్వాలంటూ కోరుతూవస్తున్నారు. మరోపక్క సింబల్ ఓటింగ్‌పైనే దృష్టి కేంద్రీకరించిన కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు తమ గిరిజన సామాజిక వర్గ ఓటర్లు చేజారకుండా చూసుకునేందుకు ఆయా అసెంబ్లీ సెగ్మెంట్ల, మండలాల ముఖ్యనేతలతో పాటు ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులను సైతం కలుసుకుంటూ ఈ ఎన్నికల్లో తమను ఎలాగైనా బయటపడేయాలని కోరుతూ వస్తున్నారు.

అభ్యర్థులకు సవాల్‌గా..

ఉద్యమ ఆకాంక్షతో వరుసగా రెండుసార్లు మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గంపై గులాబీ జెండా ఎగురవేసింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ బోల్తాపడి, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన దరిమిలా రేపటి పార్లమెంట్ ఎన్నికలు మళ్లీపోటీలో ఉంటున్న సిట్టింగ్ బీఆర్ఎస్ ఎంపీ కవితతో పాటు కాంగ్రెస్ నుంచి బరిలో నిలుస్తున్న పోరిక బలరాంనాయక్, బీజేపీ నుంచి పోటీలో ఉంటున్న అజ్మీర సీతారాంనాయక్‌కు సవాల్‌గానే పరిణమిస్తున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండడంతో పాటు మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్‌లలో ఆరింట కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ఉండగా మరో నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కూడా సీఎం రేవంత్‌రెడ్డితో కలిసిన నేపథ్యంలో దాదాపు ఆయన కూడా కాంగ్రెస్‌కు మొగ్గ చూపినట్టేనని పరిశీలకుల భావన.

ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీకే విజయావకాశాలు ఉంటాయని రాజకీయ అంచనాలు ఉండగా., పార్టీలో అందరిని సమన్వయ పరుస్తూ గ్రూపు రాజకీయాలకు అతీతంగా సింబల్ ఓటింగ్ వేయించుకునే దిశగా అభ్యర్థి బలరాంనాయక్ రాజకీయ నైపుణ్యత ప్రదర్శించడం కూడా అంతేముఖ్యమని చెబుతున్నారు. ఇక సిట్టింగ్ ఎంపీ కవిత మరోసారి బీఆర్ఎస్ నుంచి బరిలో ఉండడంతో తాజా మాజీగా ఏ మేరకు గత ఎన్నికల్లో తనకు మద్దతిచ్చిన ఓటర్లు తిరిగి ఓటేస్తారా.. అన్న విషయంలో సవాలక్ష సందేహాలు తలెత్తుతున్నాయి. ప్రధానంగా రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండడం, పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో కలిపి గత అసెంబ్లీ ఎన్నికల్లో సుమారు రెండు లక్షల నలభైవేల పైచిలుకు ఓట్లు కాంగ్రెస్‌కే ఎక్కువగా ఉండడం ఇదే ఊపు పార్లమెంట్ ఎన్నికల్లో కొనసాగితే బీఆర్ఎస్ పరిస్థితి కష్టమేనని విశ్లేషకులు అంటున్నారు.

మరోపక్క బీఆర్ఎస్ మాజీ ఎంపీగా కొనసాగిన తెలంగాణ ఉద్యమ నేత, ప్రొఫెసర్ అజ్మీర సీతారాంనాయక్ ఈ ఎన్నికల్లో బీజేపీలో చేరి ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తుండడం కూడా బీఆర్ఎస్ ఓట్లకు గండిపెట్టినట్లేనన్న వాదన కూడా విన్పిస్తోంది. ఈ రెండింటికి తోడు రాష్ట్రంలో ఒకరొకరుగా ఎంపీ, ఎమ్మెల్యేలు, మరి కొందరు ముఖ్యులు బీఆర్ఎస్‌ను వీడడం.. కాంగ్రెస్‌లో చేరడం లాంటి పరిణామాలు ఈ ఎన్నికల్లో తీవ్ర నష్టాన్ని కలిగిస్తాయని పేర్కొంటున్నారు.

నాటికినేటికి...

ఉద్యోగం, నిరుద్యోగం..

తెలంగాణ ఉద్యమ ఆవిర్భావ నుంచి వరుసగా రెండుసార్లు జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో నిరుద్యోగం ప్రధానాంశంగా మారింది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్న భరోసా గులాబీకి జై కొట్టించింది. వెనక్కి తిరిగి చూసుకుంటే.. యువత, నిరుద్యోగులకు మొండిచేయ్యే కన్పిస్తోంది. అందుకే కాబోలు గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారెంటీలకు మద్దతు పలికారు. కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వ ఏర్పాటై వందరోజులు దాటిన సందర్భంలో ప్రభుత్వ కొలువుల జాతర మళ్లీ యువత, నిరుద్యోగులకు ఆశాజనకంగా మారింది. అందుకే వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కే మద్దతిచ్చే పరిస్థితి కన్పిస్తోందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు.

ఇక కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తక్కువేం కాదు.. తమదైన శైలీలో అనేక పథకాలను ప్రాచుర్యంలోకి తెస్తూ గల్లీలో ఎవరున్న ఢిల్లీలో మోదీ ఉండాలంటూ ప్రధాన ప్రచారాస్త్రంగా ఎన్నికల బాణాన్ని సందిస్తోంది. మహబూబాబాద్ పార్లమెంట్ సీటుపై పూర్తిస్థాయి నిఘా సారించి ఆచితూచీ మరి బీఆర్ఎస్ నుంచి దిగుమతి చేసుకున్న మాజీ ఎంపీ, మేధావి వర్గానికి చెందిన ప్రొఫెసర్ అజ్మీర సీతారాంనాయక్‌ను రంగంలో దింపింది. ఆయన కూడా పూర్వాశ్రమ పరిచయాలను ఉపయోగించుకుంటూ తనకు అవకాశం ఇస్తే ఉక్కు పరిశ్రమతో పాటు నిరుద్యోగులకు ఉపాధి అవకాశాల కోణంలో కేంద్రం పరిధిలో ఉన్న అన్ని పథకాలను తీసుకువస్తానని రంగంలో దిగుతున్నారు.

బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపి అభ్యర్థి మాలోతు కవిత అన్ని అసెంబ్లీ సెగ్మెంట్‌లలో తత్సంబంధాలు కొనసాగిస్తూ ఉండడంతో మరోసారి అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. దశాబ్ద కాలంగా పూర్వ సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో చేసిన అభివృద్ధితోనే తెలంగాణ గుర్తింపు పొందిందని మళ్లీ.. అవకాశమిచ్చి కేంద్రంతో కొట్లాడి తెలంగాణలో ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు సహకరించాలని ప్రచారం చేస్తున్నారు. మొత్తానికి ఈ ముగ్గురు ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే ఆయా అసెంబ్లీ సెగ్మెంట్‌లలో ఎన్నికల వేడి రగిలిస్తున్నారు.



మానుకోటలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో కాముడిని దహనం చేస్తున్న మా అసోసియేషన్ బాధ్యులు

కాముడి దహనం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 24 : జిల్లా కేంద్రంలో హోలీ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం రాత్రి కాముడిని దహనం చేశారు. మానుకోట పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో మా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టి, హోలీ వేడుకలను జరుపుకున్నారు. కార్యక్రమంలో మా అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డుపల్లి ఉపేంద్రం, వివిధ పార్టీల, ప్రజా సంఘాల నాయకులు ఘనపురపు అంజయ్య, కామ సంజీవరావు, బండారు వెంకటరమణ, మందుల రఘు, ఇనుగుర్తి సుధాకర్, నల్లు సుధాకర్‌రెడ్డి, పాలబిందెల మల్లయ్య, పరంధామయ్య, కాంపాటి ఉప్పలయ్య, పుచ్చకాయల రామకృష్ణ, మహంకాళి వెంకన్న, గాంధీ వీరన్న, రామదాసు పాల్గొన్నారు.

- మార్వాడి యువమంచ్ ఆధ్వర్యంలో కాముడి దహనం చేశారు. అనంతరం ఒకరికొకరు రంగులు పూసుకుని హోలీ పర్వదిన వేడుకలను ప్రారంభించారు. మార్వాడి యువమంచ్, మార్వాడీ మహిళామంచ్ బాధ్యులు పాల్గొన్నారు.

కామదహనంలో పాల్గొన్న ఎస్పీ



మహబూబాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : హోలి సందర్భంగా ఆదివారం రాత్రి ఎస్పీ క్యాంపు కార్యాలయంలో కామదహనం కార్యక్రమంలో ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హోలీ పండుగను జిల్లా ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని కోరుతూ ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

‘మానసిక ఉల్లాసానికి క్రీడలు’

మహబూబాబాద్ రూరల్, మార్చి24 : మానసిక, శారీరక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడుతాయని, క్రీడల ద్వారా సమిష్టితత్వం పెరుగుతుందని ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో మహబూబాబాద్ సబ్‌డివిజన్ పోలీస్‌టీమ్ వర్సెస్ తొర్రూరు సబ్‌డివిజన్ పోలీస్‌టీమ్‌లు ఫ్రెండ్లీ క్రికెట్‌లో తలపడ్డాయి. ఈ క్రీడల్లో తొర్రూరు సబ్‌డివిజన్ పోలీస్ టీమ్ విజయం సాధించింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగం ఎన్నో సవాల్‌తో కూడికునిఉందని, తమకర్తవ్యం నిర్వహణలో భాగంగా రేయింబవళ్లు పని చేయాల్సి ఉంటుందన్నారు. ఇలాంటి క్రీడలు మన నిత్యజీవితంలో భాగంగా మానసికంగా, దృఢత్వంగా, ఉత్సాహంతో పనిచేసేలా చేస్తాయని చెప్పారు. మహబూబాబాద్ సబ్ డివిజన్‌టీమ్ 12 ఓవర్లకు 90 పరుగులు చేయగా తొర్రూరు సబ్‌డివిజన్ టీమ్ 91 పరుగులు చేసి విజయం సాధించినట్లు చెప్పారు. అనంతరం గెలుపొందిన తొర్రూరు సబ్‌డివిజన్‌టీమ్‌కు మెమోంటోను అందించారు. కార్యక్రమంలో ఏఎస్పీ జోగుల చెన్నయ్య, సీఐలు, ఎస్సైలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

వందరోజుల పాలనలో కాంగ్రెస్ సర్కార్ వైఫల్యం

- బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాంమోహన్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రాంమోహన్ రెడ్డి

తొర్రూరు, మార్చి 24 : వందరోజుల కాంగ్రెస్ పార్టీ పాలనలో అన్నిరంగాల్లో పూర్తిగా వైఫల్యం చెందిందని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ తెలంగాణలో అఖండ విజయం సాధిస్తుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి లేగ రాంమోహన్‌రెడ్డి జోస్యం చెప్పారు. ఆదివారం తొర్రూరులో పాలకుర్తి నియోజకవర్గ కన్వీనర్ పూసల శ్రీమాన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సాధ్యంకాని హామీలను ఇచ్చి రేవంత్ రెడ్డి సర్కారు అధికారంలోకి వచ్చాక, అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి నాయకత్వంపై విశ్వాసం తగ్గిపోయిందని, నియోజకవర్గంలో దొరల పాలన కొనసాగుతోందన్నారు. పాలకుర్తి ప్రజల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని, ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంలో మాజీ ఎమ్మెల్యే దయాకర్‌రావు అరెస్టు కావడం ఖాయమన్నారు. ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. ఈనెల 27వ తేదీన నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్‌లు బీజేపీలో భారీగా చేరుతారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రంగు రాములు, ఝాన్సీ, కోటేశ్వర్‌రావు, కన్నయ్య, పల్లె కుమార్, సురేష్, రాజేష్, యాదగిరి, ఎం.యాకయ్య, నవీన్‌రెడ్డి, శేఖర్, నవీన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులపై బీఆర్ఎస్ నాయకుల మొసలి కన్నీరు

- వారు ఉన్నప్పుడు కాల్వలు తవ్విన దాఖలాలు లేవు
- పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ శ్రేణులు సత్తాచాటాలి
- ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రునాయక్, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జాటోతు రామచంద్రునాయక్, మామిడాల యశస్వినిరెడ్డి

పెద్దవంగర, మార్చి 24 : రైతులపై బీఆర్ఎస్ నాయకులు మొసలి కన్నీరు కారుస్తున్నారని ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రామచంద్రునాయక్, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి విమర్శించారు. ఆదివారం రెడ్డికుంటతండా శివారులోని సర్పంచ్‌తండాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఘన్‌పూర్ రిజర్వాయర్ నుంచి చెన్నూరు రిజర్వాయర్ వరకు ఆనాడు రైతులు బాగుండాలని కాలువలు తవ్వించింది కాంగ్రెస్ ప్రభుత్వమే..! కానీ, కమిషన్లకు కక్కుర్తిపడి పదేళ్లు చెన్నూరు రిజర్వాయర్‌ను ఓపెన్ చేయకుండా రైతులను ముంచింది బీఆర్ఎస్ ప్రభుత్వమని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని తెలిసి, ముందే కాళేశ్వరం గేట్లను ఎత్తివేసి నీటిని గోదావరి పాలు చేసిన బీఆర్ఎస్ ప్రబుద్ధులు, సన్నాసులు మీరు కాదా! అని ప్రశ్నించారు. పదేళ్లలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్.. ఏ ఒక్క కాల్వ కూడా తవ్విన దాఖలాలులేవని ఆరోపించారు.

బీఆర్ఎస్ నాయకులు జనగామ జిల్లా దేవరుప్పుల మండలంలో చింతబాయితండాలో ఫొటోలకు ఫోజులిస్తూ, రైతుల కోసం మొసలికన్నీరు కారవడం విడ్డురంగా ఉందని రామచంద్రునాయక్, యశస్విని రెడ్డి అన్నారు. మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావును ఒక్కటి అడుగుతున్నాం.. ప్రేమఉంటే పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు రిజర్వాయర్ పనులు ఎందుకు పూర్తి చేయలేదో ప్రజాక్షేత్రంలో చెప్పాలని డిమాండ్ చేశారు. బూత్‌స్థాయి నుంచి పటిష్టం చేస్తూ త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో 14స్థానాలు కాంగ్రెస్ పార్టీ గెలవబోతున్నదని, పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీపీసీసీ సభ్యుడు కేతిరెడ్డి నిరంజన్‌రెడ్డి, తొర్రూరు పీఏసీఎస్ చైర్మన్ హరిప్రసాద్, జాటోత్ నెహ్రూనాయక్, అనుమాండ్ల నరేందర్‌రెడ్డి, సోమరాజశేఖర్, సోమయ్య, శ్యామ్ సుందర్‌రెడ్డి, ప్రవీణ్‌యాదవ్, సైదులు, హరికృష్ణ, రాజుయాదవ్, జగ్గానాయక్, కార్యకర్తలు ఉన్నారు.

కన్నుల పండువగా

శ్రీ వేంకటేశ్వరుడి కల్యాణం

భక్తిపారవశంతో పరవసించిన భక్తులు

వివరాలు 8లో..



తాళిని చూపుతున్న అర్చకులు

‘అరూరి’కే ఖరారు

బీజేపీ వరంగల్ లోక్‌సభ అభ్యర్థిగా రమేష్

- ఐదో జాబితాలో ప్రకటించిన బీజేపీ అధిష్ఠానం
- ఎట్టకేలకు ఉత్కంఠకు తెర



హైదరాబాద్‌లో కిషన్‌రెడ్డిని కలిసిన అరూరి రమేష్

హనుమకొండ టౌన్, మార్చి 24: బీజేపీ వరంగల్ లోక్‌సభ అభ్యర్థిత్వంపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. వరంగల్ లోక్‌సభ అభ్యర్థిగా ఇటీవలే బీజేపీలో చేరిన వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ పేరును అధిష్ఠానం ప్రకటించింది. బీజేపీ వరంగల్ లోక్‌సభ టికెట్ కోసం ఆరడజను మందికి పైగా ఆశావహులు ప్రయత్నాలు చేశారు. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, పరకాల మునిసిపల్ చైర్మన్ రాజభద్రయ్య, బీజేపీ సీనియర్ నేతలు చింత సాంబమూర్తి, మాజీ మంత్రి గుండె విజయరామారావులతో పాటు మాజీ డీఐజీ టి.కృష్ణప్రసాద్ తదితరులు టికెట్ కోసం ప్రయత్నాలు చేశారు. ఎట్టకేలకు అరూరికే కమలనాథులు మొగ్గుచూశారు. కాగా, వరంగల్ ఎంపీ సీటుకు బీఆర్ఎస్, బీజేపీలు తమ అభ్యర్థులను ఖరారు చేయగా, కాంగ్రెస్ అభ్యర్థి తేలలేదు. వరంగల్ లోక్‌సభ సీటుపై బీజేపీ ప్రత్యేక దృష్టి సారించింది. బీజేపీకి మద్దతు ఇస్తున్న ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ

మిగతా 8వ పేజీలో

రాత్రంతా శ్మశాన వాటికలోనే మృతదేహం

- సొంత ఇల్లులేక దైన్యంగా అంత్యక్రియలు
- ఇంటి పట్టాఇచ్చి స్థలాన్ని చూపని అధికారులు
- ఏడాది క్రితం భర్త మృతదేహం ఇలాగే
- ఇప్పుడు అత్త భౌతికకాయం

కేసముద్రం, మార్చి 24 : రాత్రంతా శ్మశానంలో మృతదేహంతో బిక్కుబిక్కుమంటూ ఆ కుటుంబం దయనీయ పరిస్థితిలో ఉంది. ప్రభుత్వం ఇల్లు నిర్మించుకునేందుకు పట్టా జారీచేసి, ఇంటి స్థలం ఎక్కడానేది చూపకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సొంత ఇల్లులేక అయినవారి అంత్యక్రియలను కూడా సక్రమంగా చేసుకోలేని దైన్యం నెలకొంది. ఇందుకు నిదర్శనంగా కేసముద్రం విలేజిలో శనివారం రాత్రి రంగోజు రుక్కమ్మ (85) మృతదేహాన్ని ఇంటికి కాకుండా శ్మశాన వాటికకు తీసుకువచ్చారు. గ్రామానికి చెందిన రుక్కమ్మ వరంగల్ ఎంజీఎంలో శనివారం సాయంత్రం మృతి చెందారు. రుక్కమ్మ అద్దెఇంట్లో ఉండడంతో ఇంటి యజమాని ఆమె మృతదేహాన్ని ఇంట్లోకి తీసుకురావద్దని సూచించారు. దీంతో రుక్కమ్మ కోడలు ఉపేంద్ర చేసేదేమీ లేక వరంగల్ ఎంజీఎం నుంచి నేరుగా శనివారం రాత్రి గ్రామంలోని శ్మశానవాటికకు తీసుకువెళ్లింది. రాత్రి నుంచి మరుసటి రోజు ఆదివారం ఉదయం వరకు మృతదేహంతోనే ఆ కుటుంబం ఉంది. సాయంత్రం గ్రామస్తుల సహకారంతో రుక్కమ్మ మృతదేహానికి దహన సంస్కారాలు పూర్తి చేశారు. రుక్కమ్మ కుమారుడు సుమారు ఏడాది క్రి తం అనారోగ్యంతో మృతి చెందగా, ఇదే మాదిరిగా ఆయన మృతదేహాన్ని శ్మశాన వాటికకే తరలించారు. ఉపేంద్ర పేరిట కేసముద్రం విలేజిపరిధిలో కొద్దినెలల క్రితం ప్రభుత్వం ఇంటి స్థలాన్ని కేటాయిస్తూ పట్టాజారీ చేసింది. అయితే ఇంటి నిర్మాణం కోసం స్థలాన్ని మాత్రం చూపలేదు. దీంతో సొంత ఇంటిని నిర్మించుకోలేకపోయారు. ఈ క్రమంలో భర్త, అత్తమృతి చెందడంతో వారి అంత్యక్రియలను కూడా సరిగా చేసుకోలేని దీనస్థితి నెలకొందని బాధితురాలు ఉపేంద్ర వాపోయారు. ఇప్పటికైనా తమకు ఇంటిస్థలాన్ని చూపి, ఇంటిని నిర్మించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు.



కేసముద్రం విలేజి శ్మశానవాటికలో అత్త మృతదేహం వద్ద ఇంటిస్థల పట్టాను చూపుతున్న కోడలు ఉపేంద్ర



రంగోజు రుక్కమ్మ మృతదేహం



మహబూబాబాద్‌లో మీడియా సెంటర్‌ను సందర్శిస్తున్న కలెక్టర్

ఎన్నికలు సజావుగా సాగడంలో మీడియా పాత్ర కీలకం

కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్ టౌన్, మార్చి 23 : ఎన్నికలు సజావుగా సాగడంలో మీడియా కీలకపాత్ర వహించాల్సి ఉంటుందని, అందుకు పాత్రికేయులంతా సహకరించాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి అద్వైత్‌కుమార్‌సింగ్ సూచించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మహబూబాబాద్ సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, మొదటిఅంతస్తులో ఉన్న కంట్రోల్ రూంను శనివారం రాత్రి కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు సమాచారం అందించడం కోసం, వివిధ రాజకీయ పార్టీల ప్రచార అనుమతుల కోసం మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) మీడియా సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ శ్రీధర్, ఎంసీఎంసీ నోడల్ అధికారి, డీపీఆర్వో రాజేంద్రప్రసాద్, భూ గర్భజలశాఖ డీడీ వేముల సురేష్, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) నోడల్ ఆఫీసర్ నర్మద పాల్గొన్నారు.

ఎస్సార్ వర్సిటీ అసోసియేట్ డీన్ సుమన్‌కు పురస్కారం

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 24: ఎస్సార్ వర్సిటీ అసోసియేట్ డీన్ డాక్టర్ ఎన్.సుమన్‌కు హైదరాబాద్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ 2023-24 విద్యాసంత్సరానికి గాను అకడమీషియన్ ఎక్సలెన్సీ పురస్కారాన్ని ప్రదానం చేసింది. శనివారం హైదరాబాద్‌లో జరిగిన అసోసియేషన్ 51వ వార్షిక అవార్డుల కార్యక్రమంలో డాక్టర్ సుమన్‌కు ఈ పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, విశిష్ట అతిథులు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ జేబీ రావు, డీఆర్‌డీవో జనరల్ మేనేజర్ రాజాబాబు హాజరయ్యారు. కాగా, అసోసి యేషన్ ప్రతినిధుల చేతుల మీదుగా డాక్టర్ సుమన్ పురస్కార ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. తెలంగాణ ప్రాంతంలోనే ప్రముఖ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అవార్డును అందుకున్న డాక్టర్ సుమన్‌ను ఎస్సార్ వర్సిటీ వీసీ దీపక్, రిజిస్ట్రార్ అర్చనరెడ్డి, అధ్యాపకులు శుభాకాంక్షలు తెలిపారు.



పురస్కార ప్రశంసా పత్రాన్ని స్వీకరిస్తున్న డాక్టర్ సుమన్

25 కోడెలను అదుపులోకి తీసుకున్న పోలీసులు

వరంగల్ క్రైం, మార్చి 24: అనుమానాస్పదంగా డీసీఎంలో తరలిస్తున్న 25 కోడెలను కాకతీయ యూనివర్సిటీ పోలీసులు అదుపులోకి తీసుకుని నలుగురిపై కేసు నమోదు చేశారు. ఆదివారం సాయంత్రం కోదాడ నుంచి పెద్దపల్లికి డీసీఎంలో 25 కోడెలను నలుగురు వ్యక్తులు తరలిస్తుండగా ఓఆర్ఆర్‌పై పోలీసులు పట్టుకున్నారు. ఏడు మాత్రమే డీసీఎంలో తరలించాల్సి ఉండగా, 25 కోడెలను తరలిస్తుండటంతో అనుమానం వచ్చి పట్టుకున్నారు.

తరలిస్తున్న నలుగురు వ్యక్తులనుంచి సరైన సమాధానం రాకపోవడంతో కోడెలను ముప్పారంలోని బృందావన్ గోశాలకు తరలించారు. నలుగురి వ్యక్తులపై కేసు నమోదు చేశారు. ఈ విషయాన్ని కేయూ ఎస్ఐ దేవేందర్ ధ్రువీకరించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

యాసంగి ధాన్యం సేకరణకు ఏర్పాట్లు

- ఏప్రిల్ మూడోవారం నుంచి కొనుగోళ్లు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1078 కొనుగోలు కేంద్రాలు
- ధాన్యం దిగుబడి 14.13 లక్షల మెట్రిక్ టన్నులు
- అందుబాటులో చాలినన్ని గన్నీ బ్యాగులు
- కమీషన్ చెల్లింపులో జాప్యం.. 22 కోట్ల బకాయిలు


ధాన్యం సేకరణ కేంద్రం

హనుమకొండ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి)ఉమ్మడి వరంగల్ జిల్లాలో యాసంగి (రబీ) సీజన్ ధాన్యం కొనుగోళ్లకు పౌరసరఫరాల శాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఏప్రిల్ మూడో వారం నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కానున్నాయి. ఈ సీజన్ 9.16 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇందు కోసం 1078 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.ఉమ్మడి జిల్లాలో ఈ సారి యాసంగిలో 9,18,337.59 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. 14,13,454 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి కావచ్చునని పౌరసరఫరాల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు ఏర్పాట్లకు అధికారులు పూనుకుంటున్నారు.

మొదలుకానున్న కోతలు

ఉమ్మడి జిల్లాలో మరో 15 రోజుల్లో యాసంగి వరి కోతలు ప్రారంభం కానున్నాయి. గతేడాది సెప్టెంబరులో పంటలు వేసిన రైతులు వరికోతలకు సిద్ధమవుతున్నారు. డిసెంబరు, జనవరి నెలల్లో నాట్లు వేసిన రైతులకు మరో నెల రోజులు సమయం పట్టే అవకాశం ఉంది. జిల్లాలో వరి కోతలు ప్రారంభమైతే పెద్ద ఎత్తున మార్కెట్‌కు ధాన్యం వచ్చే అవకాశం ఉంటుంది. ఏటా రైతులు పౌరసరఫరాల సంస్థ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయం చేస్తారు. ఇప్పటి నుంచే ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై కసరత్తు చేస్తేనే వరి కోతలు వచ్చే సరికి అవి అందుబా టులోకి వస్తాయి. లేకుంటే రైతులు గతేడాదిలా రైతులు తీవ్ర ఇబ్బందులు పడే అవకా శం ఉంది. కాగా ఈ యాసంగిలో రైతులు పెద్ద ఎత్తున వరిని సాగు చేయగా సాగునీటి సరఫరా, భూగర్భ జలాలు అడుగ ంటిపోవడంతో పంటను కాపాడుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. పలు చోట్ల నీటి తడులు లేక పొలాలు నెర్రెలుబారాయి. కొందరు మధ్యలోనే పంటను వదిలేస్తున్నారు. దీనికితోడు వడగల్లు, అకాల వర్షాల బెడద కూడా పొంచి ఉంది. ఈ నేపథ్యంలో త్వరగా కోతలు ప్రారంభించి వెంటనే ధాన్యాన్ని విక్రయించాలని రైతులు భావిస్తున్నారు. ప్రభుత్వం గ్రేడ్ ఏ ధాన్యం క్వింటాకు రూ. 2203,. కామన్ ధాన్యానికి క్వింటా రూ. 2183 మద్దతు ధరను ప్రకటించింది.

ఇతరులు కనిపించొద్దు..

రైస్ మిల్లర్లు, రేషన్ డీలర్లు, ఇతరత్రా ప్రైవేటు వ్యక్తులెవరూ ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద కనిపించకుండా తగిన జాగ్రతలు తీసుకోవల సింది గా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, ధాన్యం సేకరణ సిబ్బందికి అప్పుడే ఆదేశాలు జారీ చేశారు. అప్పులు వడ్డీ భారం దృష్ట్యా సకాలంలో సీఎంఆర్ డెలివరీ, బకాయిల రికవరీ జరిగేలా చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

గన్నీ బ్యాగులు..

ధాన్యం సేకరణలో గన్నీ బ్యాగుల పాత్ర కీలకం. చాలినన్ని గన్నీ బ్యాగులు లేకుంటే దాని ప్రభావం సేకరణపై పడుతుంది. ఈ దృష్ట్యా సేకరణ ప్రారంభానికి ముందే అన్ని జిల్లాల్లో గన్నీ బ్యాగులు చాలినంత మేరకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. అన్ని జిల్లాలో అప్పటికే అవసరమైనన్ని గన్నీ బ్యాగులను అందుబాటులో ఉంచారు. ధాన్యం కొనుగోళ్ళు ప్రారంభం కాగానే వీటిని ఆయా కేంద్రాల ఇండెంట్‌ను బట్టి సరఫరా చేస్తారు. గత యాసంగి సీజన్ కన్నా ఈ సారి ధాన్యం దిగుబడులు పెద్దగా పెరిగే అవకాశాలు లేనందు వల్ల ప్రస్తుతం ఉన్న బ్యాగులు సరిపోతా యని అధికారులు చెబుతున్నారు.

కమిషన్ బకాయిలు

ధాన్యం కొనుగోలు కేంద్రాలకు పౌరసరాలశాఖ కమిషన్‌ను వెంట వెంటనే చెల్లించకపోవడంతో బకాయిలు రూ. కోట్లలో పేరుకు పోతున్నాయి. ప్రస్తుతం మూడు సీజన్ల బకాయిలు కేంద్రాలకు రావలసి ఉన్నది. సుమారు ఒక్కో జిల్లాకు రూ. 3 నుంచి రూ. 4 కోట్ల వరకు బకాయిలు ఉన్నాయి. ఉ మ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు రూ. 20 కోట్ల మేరకు బకాయిలు ఉన్నట్టు అంచనా. దీంతో ఐకేపీ, పీఏసీఎస్ అధ్వర్యంలోని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు బకాయిల కోసం రాష్ట్ర ప్రభుత్వంపై గత కొద్ది రోజులుగా ఒత్తిడి తెస్తున్నాయి. తమకు కమిషన్ బకాయలు చెల్లిస్తే తప్పా ఈ సారి కేంద్రాలను తెరవమని హెచ్చరించాయి. దీనితో ధాన్యం కొనుగోళ్ళ ప్రారంభం కావడానికి ముందు మార్చి చివరి వారంలో బకాయిలను చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్టు సమాచారం.

సౌకర్యాలు..

కొనుగోలు కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలను పౌరసరఫరాల శాఖ అధికారులు కల్పిస్తున్నారు. రైతులు అమ్మకానికి కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యం అకాల వర్షాల వల్ల తడవకుండా ఉండేందుకు అవసరమైన టార్పాలిన్లను సిద్ధం చేస్తున్నారు. ధాన్యం తూకం త్వరిత గతిన జరిగేందుకు వీలుగా చాలినన్ని తూకం యంత్రాలను, ధాన్యం తేమను కొలిచే పరికరాలను కూడా చాలినన్ని సమకూరుస్తున్నారు. వీటితో పాటు కొనుగోలు చేసిన ధాన్యా న్ని మిల్లులకు చేరవేసేందుకు అవసరమైన లారీలను కూడా అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అయితే లోక్‌సభ ఎన్నికలతో ప్రస్తుతం కోడ్ అమలులో ఉన్న దృష్ట్యా ఈసారి కొత్తగా టెండర్లు పిలిచే అవకాశం లేనందు వల్ల గత లారీ ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్లనే ఈ సీజన్‌లో కొనసాగించనున్నట్టు తెలుస్తోంది.

జిల్లాల వారీగా ..

● వరంగల్ జిల్లాలో రబీలో ధాన్యం కొనుగోలుకు 208 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలో ఈ సారి 1,10,70540 ఎకరాల విస్తీర్ణంలో వరి సాగయింది. ధాన్యం దిగుబడి 2,55,429.18 మెట ఉండవచ్చునని అంచనా వేశారు. 1.50 లక్షల మెట్రిక్ టన్నులు మేరకు కొనుగోలు చేయాలన్నది లక్ష్యంగా నిర్ణయించారు.

● హనుమకొండ జిల్లాలో 150 కేంద్రాల ద్వారా 1.61 లక్షల మె.ట ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించారు. జిల్లాలో 1,18,061.06 ఎకరాల్లో వరిసాగు చేశారు. ఈ మేరకు 3,16,231.57 మె.ట . ధాన్యం దిగుబడి రావచ్చునని అంచనా.

● జనగామ జిల్లాలో ఈ సారి రబీ సీజన్‌లో ధాన్యం సేకరణకు 195 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వీటి ద్వారా 2.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలన్నది లక్ష్యం. జిల్లాలో ఈ సీజన్‌లో 4,33,289.87 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఈ మేరకు 4,03,468.30 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి కావచ్చునని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు.

● మహబూబాబాద్ జిల్లాలో ధాన్యం సేకరణకు ఈ సారి 192 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. వీటి ద్వారా 1.70 లక్షల మె.ట ధాన్యం సేకరించాలన్నది లక్ష్యం. జిల్లాలో ఈ సారి రబీ సీజన్‌లో 128516.57 ఎకరాల్లో వరి సాగు చేశారు. 2,52,766.60 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి కావచ్చునని అంచనా వేస్తున్నారు.

● ములుగు జిల్లాలో 144 కొనుగోలు కేంద్రాల ద్వారా 85 వేల మె.ట ధాన్యం సేకరించనున్నారు. జిల్లాలో ఈ సీజన్‌లో 46979.40 ఎకరాల్లో వరి సాగు చేశారు. 10477547 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి కావచ్చునని అంచనా.

● జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 189 కొనుగోలు కేంద్రాల ద్వారా 1.20 లక్షల మెట ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించారు. జిల్లాలో ఈ సారి 80,785.29 ఎకరాల్లో వరి సాగుకాగా దిగుబడి 209976 మెట కావచ్చునని భావిస్తున్నారు.

మహిళపై యువకుడి దాడి

హనుమకొండ టౌన్, మార్చి24: తెల్లవారుజామున ఓ యువకుడు ఇంట్లోకి చొరబడి నీ కూతురెక్కడంటూ నానా హంగామా చేశాడు. అడ్డుకోబోయిన తల్లిపై కర్రతో దాడిచేసిన సంఘటన హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కుమార్‌పల్లిలో చోటుచేసుకుంది. కాజీపేటకు చెందిన మల్యాల రమేశ్ అనే యువకుడు.. ఈ నెల 19న ఉదయం 6 గంటల ప్రాంతంలో కుమార్‌పల్లిలోని ఓ మహిళ ఇంట్లోకి చొరబడి నీ కూతురెక్కడంటూ ఇళ్లంతా గాలించాడు. ఈలోగా మహిళ పోలీసులకు ఫోన్‌చేయడానికి ప్రయత్నిస్తుండగా కర్రతో మహిళ ముఖంపై బలంగా కొట్టగా ముఖంపై గాయాలయ్యాయి. ఆ తర్వాత యువకుడు అక్కడి నుంచి పరారయ్యాడు. బాధిత మహిళ కె.మాధవి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డబ్బులు ఇవ్వడం లేదంటూ సొంతింటికే నిప్పు

ఇంట్లో సామగ్రి దహనం


నాగారంలో ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై తదితరులు

నెక్కొండ, మార్చి 24: చేసిన అప్పులు తీర్చడానికి తల్లిదండ్రులు డబ్బులు ఇవ్వలేదని కోపంతో కుమారుడు ఏకంగా ఇంటికే నిప్పుపెట్టిన ఘటన వరంగల్ జిల్లా నెక్కొండ మండలం నాగారం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం... వ్యవసాయ కూలీలు కుమ్మరి వెంకన్న-ఐలమ్మ దంపతుల కుమారుడు మధు పదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఐదేళ్ల క్రితం మధు భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి హైదరాబాద్‌లో ఉంటూ పెట్రోల్ బంక్‌లో పని చేసేవాడు. వ్యక్తిగత అవసరాలకు మధు రూ.1.50లక్షల వరకు అప్పుచేశాడు. అప్పు తీర్చడానికి డబ్బులు ఇవ్వాలని తల్లిదండ్రులను నెల రోజులుగా ఒత్తిడి తెస్తున్నాడు. ఈక్రమంలో రెండు రోజుల క్రితం కుటుంబంతో మహబూబాబాద్ జిల్లా కంబాలపల్లిలో బంధువుల ఇంట్లో ఫంక్షన్‌కు వచ్చాడు. అక్కడి మధు తల్లిదండ్రులు కూడా వచ్చారు. అక్కడ కూడా డబ్బుల విషయంలో తల్లిదండ్రులతో గొడవ పడ్డాడు. అదే రోజు రాత్రి మధు ఒంటరిగా నాగారంలోని ఇంటికి చేరుకున్నాడు. ఆదివారం ఉదయం ఇంటి సమీపంలో ఉన్న ఓ ద్విచక్ర వాహనం నుంచి పెట్రోల్ తీసి ఇల్లంత చల్లి నిప్పుపెట్టాడు. మంటలు వ్యాపించడంతో స్థానికులు వచ్చి మంటల్ని ఆర్పారు. అప్పటికే ఇంట్లో ఉన్న బట్టలు, వంట సామగ్రి, తలుపులు, కిటికీలు దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో కారణంగా రూ.50వేల వరకు ఆస్తినష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న ఎస్సై మహేందర్ సంఘటన స్థలానికి చేరుకొని మధును అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయంపై మధు తల్లిదండ్రులు, బంధువుల నుంచి ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

సుధాకర్‌రావు సేవలు మరువలేనివి

సంతాప సభలో పాల్గొన్న మాజీ మంత్రులు, ప్రభుత్వవిప్, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు

పెద్దవంగర, మార్చి 24 : పాలకుర్తి మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ వైద్య ఆరోగ్యశ్రీ ట్రస్టు మాజీ చైర్మన్ డాక్టర్ నెమురుగొమ్ముల సుధాకర్ రావు (74) నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజలకు అందించిన సేవలు మరవలేనివని మాజీమంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రామచంద్రునాయక్, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, మామిడాల యశస్విని, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, కొప్పుల ఈశ్వర్ అన్నారు. ఆదివారం వడ్డెకొత్తపల్లిలో సుధాకర్‌రావు నివాసంలో ఏర్పాటు సంతాప సభలో పాల్గొని, చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధి కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో సబ్బండ వర్గాల అభ్యున్నతికి, నియోజకవర్గ అభివృద్ధితో పాటు రైతుల కష్టాలు తీర్చడానికి శ్రీరాంసాగర్ కాలువద్వారా చెరువులు నింపడానికి కృషి చేశారని గుర్తు చేశారు. నిత్యం కార్యకర్తల కష్టసుఖాల్లో తోడుండేవారని, విద్యార్థి దశలోనే తెలంగాణ ఉద్యమంలో పనిచేసి సామాన్య, పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ఎన్నో సేవ కార్యక్రమాలు, వైద్య సేవలందించారని తెలిపారు. వారి కుటుంబ సభ్యులతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో సుధాకర్‌రావు విగ్రహ ప్రతిష్టాపనకు కృషి చేస్తామని తెలిపారు. సంతాప సభలో మాట్లాడుతూ ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ కన్నీంటి పర్యంతమయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, మాజీ జీసీసీ గాంధీ నాయక్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, ఎంపీపీ ఆంజయ్య, జడ్పీటీసీలు మంగళపల్లి శ్రీనివాస్, శ్రీనివాస్, నాయకులు నవీన్, ఐలయ్య, సుధీర్, సీతారాములు, జాటోతు నెహ్రూనాయక్, హరిప్రసాద్, ముత్తినేని శ్రీనివాస్, కుమార్, కుటుంబ సభ్యులు, పలు ప్రముఖ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు, అభిమానులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


సుధాకర్‌రావు చిత్రపటం వద్ద పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రులు

ఇంటర్ స్పాట్ వాల్యూయేషన్‌లో నిబంధనలకు తూట్లు

తెలంగాణ ప్రైవేటు లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పులి శ్రీనివాస్‌గౌడ్

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 24: రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకనం క్యాంపుల్లో అధికారులు నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారని తెలంగాణ ప్రైవేటు లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పులి శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. ఆదివారం హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన మూల్యాంకన కేంద్రంలో అసోసియేషన్ ఆధ్వర్యంలో కొంత సేపు నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీనియారిటిని అతిక్రమించి అధికారులు డ్యూటీలు ఇస్తున్నారని, 10 నుంచి 20 యేళ్ల అనుభం ఉన్న ప్రైవేటు లెక్చరర్లకు క్యాంపుల్లో ఏఈలుగానే విధులు నిర్వర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఈలుగా అవకాశం ఇవ్వకుండా అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారన్నారు. పైస్థాయి విధుల్లో పనిచేస్తున్న కొంతమంది అధ్యాపకులకు ఎన్నిలకు డ్యూటీలు పడినప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా ఒకేసారి డబుల్ డ్యూటీలు చేస్తున్నారని ఆరోపించారు. వరంగల్‌లోనే ఆర్జేడీ కార్యాలయాన్ని కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమం అనంతరం క్యాంపు అధికారి ఎ.గోపాల్‌ను కలిసి తమకు న్యాయం చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.



క్యాంపు అధికారి గోపాల్‌కు వినతి పత్రం అందజేస్తున్న ప్రైవేటు లెక్చరర్స్ అసోసియేషన్ నాయకులు పులి శ్రీనివాస్ గౌడ్

కాంట్రాక్టర్ గుప్పిట్లోనే సింథటిక్ ట్రాక్

● డీఎస్‌ఏకు అందుబాటులోకి రాని జేఎన్‌ఎస్ ట్రాక్ ● నిర్మాణమై రెండున్నరేళ్లయినా అప్పగింతలో జాప్యం ● కంప్లీషన్ లెటర్ ఇచ్చి ఆర్నెళ్లు ● అయినా పట్టించుకోని పీఆర్ శాఖ

వరంగల్ స్పోర్ట్స్, మార్చి24: హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్‌ఎస్)లో నిర్మించిన అథ్లెటిక్స్ సింథటిక్‌ట్రాక్ పనులు పూర్తయి రెండున్నరేళ్లు గడుస్తున్నా ఇంకా కాంట్రాక్టర్ గుప్పిట్లోనే ఉంది. నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ నేటి వరకు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ(డీఎస్‌ఏ)కు అప్పగించక పోవటంతో క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రతిష్ఠాత్మకంగా..

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఖేలో ఇండియా పథకం ద్వారా అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు కలిగి, అత్యాధునిక హంగులతో సింథటిక్‌ట్రాక్‌ను మంజూరు చేసింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వర్ధమాన అథ్లెట్లకు జాతీయ, అంతర్జాతీయస్థాయి శిక్షణతో పాటు మెరికల్లాంటి క్రీడాకారులకు వేదికగా నిలిచేందుకు సుమారు రూ.7కోట్ల నిధులతో 400 మీటర్ల, 8లైన్లతో కూడిన అథ్లెటిక్ సింథటిక్ ట్రాక్‌ను కేటాయించింది. కేంద్ర ప్రభుత్వం నాలుగేళ్ల కిందట ట్రాక్ నిర్మాణ పనులను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించడంతో ఆ బాధ్యతలను పంచాయతీరాజ్ శాఖ (పీఆర్) చీఫ్ ఇంజనీరింగ్ విభాగానికి కేటాయించారు. తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (సాట్) వీసీ, ఎం.డి. పీఆర్ చీఫ్ ఇంజనీరింగ్‌తో ఒప్పందం కుదుర్చుకొని పీఆర్ శాఖ 2019 ఆగస్టు నెలలో ట్రాక్ నిర్మాణ పనుల కోసం టెండర్లను ఆహ్వానించింది. ఢిల్లీకి చెందిన శివనరేష్ అనే సంస్థ పనులు దక్కించుకుంది. సింథటిక్‌ట్రాక్‌తో పాటు క్రీడాకారులు దుస్తులు మార్చుకునేందుకు వీలుగా భవనం నిర్మించాలనే ఒప్పందంతో 2020 మార్చి నెలలో పనులు ప్రారంభించింది. అయితే ట్రాక్ నిర్మాణ పనులు చేపట్టిన సంస్థ.. కాంట్రాక్టర్ 2021 సెప్టెంబరు నెలలో ట్రాక్ పనులు పూర్తి చేశామని చెప్పినప్పటికీ సింథటిక్‌ట్రాక్ అధికారికంగా ప్రారంభానికి నోచుకోలేదు. కేంద్ర ప్రభుత్వ క్రీడా శాఖ ప్రత్యేక అనుమతితో ఇదే యేడు సెప్టెంబరు నెల 15నుంచి 19వరకు జాతీయస్థాయి ఓపెన్ టూ ఆల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు నూతనంగా నిర్మించిన అథ్లెటిక్ సింథటిక్‌ట్రాక్‌పై లాంఛనంగా కొనసాగాయి. జాతీయస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు కాంట్రాక్టర్ నేతృత్వంలో జరగడం, ట్రాక్ పనులు మొదలు పెట్టిన 9నెలలు వ్యవధిలో పనులు పూర్తి చేసి ట్రాక్ అప్పగించకపోవడంతో డీఎస్‌ఏ అధికారులు ట్రాక్‌ను అప్పగించడానికి కంప్లీషన్ రిపోర్టు ఇవ్వాలని పీఆర్ శాఖకు లేఖ రాశారు. సింథటిక్‌ట్రాక్, భవన నిర్మాణ పనులను పీఆర్ చీఫ్ ఇంజనీరింగ్ విభాగం క్వాలిటీ కంట్రోల్ అధికారులు తనిఖీ చేసి కంప్లీషన్ సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉండగా, ఆ శాఖ అధికారులు నిర్లక్ష్యం కారణంగా రెండేళ్ల అనంతరం సర్టిఫికెట్‌ను డీఎస్‌ఏకు పంపించారు. దీంతో డీఎస్‌ఏ అధికారులు పీఆర్ శాఖ ఇచ్చిన లేఖను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సాట్) టెక్నికల్ విభాగానికి పంపించడంతో సంబంధిత అధికారులు సింథటిక్‌ట్రాక్‌ను సందర్శించారు. అయితే ఇందులో కొన్ని లోపాలున్నాయని తేల్చారు. సింథటిక్‌ట్రాక్‌లో ఉన్న లోపాలను కాంట్రాక్టర్ ద్వారా సరిచేసి ట్రాక్‌ను అప్పగించే విధంగా చర్యలు చేపట్టాలని పీఆర్‌శాఖకు ఆరు నెలల కిందట డీఎస్‌ఏ అధికారులు లేఖ పంపినప్పటికీ ఇప్పటివరకు పీఆర్‌శాఖ అధికారులు కానీ, సదురు నిర్మాణ సంస్థ కాంట్రాక్టర్ స్పందించకపోవడం దురదృష్టకరమని క్రీడాభిమానులు వాపోతున్నారు.

అంతే కాకుండా ఇటీవల డీఎస్‌ఏ ఆధ్వర్యంలో హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఎల్‌ఈడీ స్క్రీన్‌లు ద్వారా కేంద్ర క్రీడా శాఖ సహాయ మంత్రి నిసిత్ ప్రమాణిక్ వర్చువల్ పద్ధతిన స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(సాయ్), స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సాట్) అధికారులు సమక్షంలో ప్రారంభించారు. సాక్ష్యాత్తు కేంద్ర క్రీడా శాఖ సహాయ మంత్రి నిసిత్ ప్రమాణిక్ సాయ్, సాట్ స్పోర్ట్స్ అధికారుల సమక్షంలో ట్రాక్‌ను ప్రారంభించినప్పటికీ కాంట్రాక్టర్ నిర్లక్ష్య ధోరణిని వీడకుండా ట్రాక్‌ను అప్పగించకుండా ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. ట్రాక్ నిర్మాణ పనులకు రూ.7కోట్లకు గాను రూ.3.50కోట్ల చెల్లింపులు మాత్రమే జరిగాయని, మిగతా డబ్బులు రావాలని కాంట్రాక్టర్ చెబుతున్నప్పటికీ.. దీనికి ట్రాక్ అప్పగించడానికి సంబంధం లేదని పలువురు అంటున్నారు. ట్రాక్ అప్పగించడానికి అభ్యంతరాలు ఉండకూడదనే పీఆర్‌శాఖ అధికారులు కంప్లీషన్ లేఖను డీఎస్‌ఏ అధికారులకు ఇచ్చారంటున్నారు. అయితే ట్రాక్ నిర్మాణం పూర్తయి రెండున్నరేళ్లు ఏళ్లు గడిచిన్నా ట్రాక్‌ను ఎందుకు అప్పగించడం లేదని పీఆర్‌శాఖ.. సాట్ అధికారులను వివరణ కోరారు. అయితే ట్రాక్ మధ్యలో చిన్న లోపాలున్నాయని, వాటిని సరిచేయించడంలో జాప్యం జరుగుతోందని, త్వరలోనే డీఎస్‌ఏకు ట్రాక్‌ను అప్పగించేలా చూస్తామని చెప్పడం కొసమెరుపు.


డీఎస్‌ఏకు అప్పగించని హనుమకొండ జేఎన్‌ఎస్ లోని అథ్లెటిక్ సింథటిక్‌ట్రాక్

ఆర్నెళ్ల కిందటే కంప్లీషన్ రిపోర్టు ఇచ్చారు..

- అశోక్‌కుమార్, జిల్లా యువజన, క్రీడల అధికారి హనుమకొండ

సింథటిక్‌ట్రాక్, భవన నిర్మాణ పనులను పంచాయతీరాజ్ శాఖ (పీఆర్) చీఫ్ ఇంజనీరింగ్ విభాగం నుంచి క్వాలిటీ కంట్రోల్ అధికారులు ట్రాక్‌ను తనిఖీ ఆర్నెళ్ల కిందటే డీఎస్‌ఏకు కంప్లీషన్ రిపోర్టు ఇచ్చారు. ఈ మేరకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సాట్) అధికారులకు కంప్లీషన్ లెటర్‌ను పంపించారు. ట్రాక్‌ను సందర్శించి లోపాలున్నాయని గుర్తించారు. కాంట్రాక్టర్ ట్రాక్‌పై ఉన్న లోపాలను పరిష్కరించే విధంగా పీఆర్‌శాఖ చర్యలు చేపట్టి త్వరితగతిన ట్రాక్‌ను డీస్‌ఏకు అప్పగించాలని ఆర్నెళ్ల కిందటే సాట్ అధికారులు లేఖ రాసినప్పటికీ నేటివరకు పీఆర్‌శాఖ అధికారులు స్పందించడం లేదు.

నోరూరిస్తున్న హలీమ్, హరీస్

● వరంగల్ త్రినగరిలో జోరుగా అమ్మకాలు ● 200లకు పైగా విక్రయ కేంద్రాలు ● ఆసక్తిగా తింటున్న ప్రజలు

వడ్డెపల్లి, మార్చి 24: రంజాన్ మాసం హలీమ్, హరీస్‌లకు ఎంతో ప్రాముఖ్యత ఉంటుంది. ఉపవాస దీక్షలతో శుష్కించిన శరీరానికి బలవర్ధకమైన అల్పాహారంగా వీటిని తీసుకుంటారు. ఇఫ్తార్ సమయంలో ఉపవాసం పూర్తయ్యాక ముస్లింలు హలీమ్, హరీస్ తింటారు. వరంగల్ నగరంలోని మండిబజార్, హనుమకొండలోని న్యూ రాయపుర, అశోక హోటల్ ప్రాంతం, సుబేదారి, కలెక్టరేట్‌తోపాటు కాజీపేట రైల్వే జంక్షన్ ఏరియాల్లో వీటి విక్రయాలు రంజాన్ మాసంలో ప్రతీ రోజు సాయంత్రం జోరుగా సాగుతున్నాయి.

తయారీ విధానం ఇలా..

ప్రధానంగా గొర్రె, మేక మాంసంతో తయారుచేసే దాన్ని హలీమ్ అంటారు. చికెన్‌తో చేసే వంటకాన్ని హరీస్ అని పిలుస్తారు. హోటళ్ల ముందు ఇటుకలతో తయారు చేసిన బట్టీలతో నిర్మించిన బట్టీలపై కట్టెలతో మంట పెడుతూ వీటిని వండుతారు. మాస్టర్లు తొలుత మాంసాన్ని శుభ్రం చేస్తారు. ఆ తర్వాత కాజు, బాదం, కిస్మిస్, పిస్తా, మునఖా, అంజీర్ వంటి దినుసులు కలిపి నీటిలో చాలా సేపు ఉడికిస్తారు. తర్వాత నానబెట్టిన గోధుమ రవ్వ , స్వచ్ఛమైన నేతిలో పాలు, పెరుగు పోసి మరో రెండు గంటల పాటు ఉడికించి తెడ్లతో బాగా కలియబెడుతారు. మెత్తగా ఉడికిన తర్వాత సాయంత్రం వేడిగా ఉన్న హలీమ్, హరీస్‌లను సిద్ధంగా పెడతారు. వీటిని గరిటెతో తీసి కప్పుల్లోకి తీసి కొత్తిమీర, పుదీన, నిమ్మకాయ ముక్క, కీర దోస, క్యారెట్‌తో పాటు కోడి గుడ్డును సైతం అలంకరించి హలీమ్, హరీస్‌తో పాటు సూప్‌ను వడ్డిస్తారు. నగర వాసులంతా వీటిని తినడానికి ఇష్టపడుతారు.

చారిత్రక నేపథ్యం..

హలీమ్ వంటకానికి శతాబ్దాల చరిత్ర ఉంది. సౌదీ అరేబియా వంటి గల్ఫ్ దేశాల్లో ప్రథమంగా ప్రారంభమైన హలీమ్ కాలక్రమేపి విశ్వవ్యాప్తిలోకి వచ్చిం ది. తొలుత హైదరాబాద్‌లోని చార్మినార్ ప్రాంతంలో ఈ వంటకం పరిచయమైంది. ఒకప్పుడు చాలా మంది వరంగల్ నగర వాసులు హలీమ్, హరీస్ తినేందుకు హైదరాబాద్‌కు వెళ్లొచ్చేవారు. సుమారు నాలుగు దశాబ్ధాల క్రితం వరంగల్ హలీమ్, హరీస్ బట్టీలు వెలిశాయి. తొలుత హైదరాబాద్‌కు చెందిన మాస్టర్లే వరంగల్‌కు వచ్చి హలీమ్, హరీస్ వండేవారు. క్రమేపీ వరంగల్‌కు చెందిన మాస్టర్లు సైతం ఈ వంటకాల తయారీపై పట్టు సాధించారు. వరంగల్ త్రినగరికి చెందిన వారందరికీ రుచికరమైన హలీమ్, హరీస్‌ను అందిస్తున్నారు. నోరూరించే విధంగా రుచికరమైన ఈ వంటకాలను తినడానికి నగర వాసులంతా ఎంతో మక్కువ కనబరుస్తున్నారు. ముస్లింలే కాక ఇతరులు సైతం వీటిని తినడానికి ఎంతో ఇష్టపడుతున్నారు.

దిల్‌షాద్ హోటల్‌లో తొలిసారి..

ప్రప్రథమంగా వరంగల్ నగరంలోని మండిబజార్ (దిల్‌షాద్ హోటల్)లో హలీమ్, హరీస్‌ను వండి నగర ప్రజలకు పరిచయం చేశారు. ఒకప్పుడు హనుమకొండ సుబేదారి, కాజీపేట, నయీంనగర్‌లోని ముస్లింలు మండి బజార్‌కు వచ్చి హలీమ్, హరీస్‌లను తినేవారు. ఆ తర్వాత హనుమకొండలోని కోహినూర్ హోటల్, సుబేదారిలోని మునవర్ హోటల్‌లో హలీమ్, హరీస్ వంటకాలు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం వరంగల్ త్రినగరిలో సుమారు 200 లకు పైగా హలీమ్, హరీస్ విక్రయ కేంద్రాలు వెలిశాయి. మెర్క్యూరి లైట్లతో విక్రయ కేంద్రాలను శోభాయమానంగా అలంకరించడంతో వినియోగదారులు ఇష్టంగా తినడానికి ఆసక్తి కనబరుస్తున్నారు.

- అమ్మకాలు బాగున్నాయి..

- ఎంఏ లతీఫ్, సుబేదారి బడేమసీద్..



రంజాన్ మాసం కాబట్టి ఇఫ్తార్ తర్వాత ముస్లింలు ఎక్కువగా హలీమ్, హరీస్‌ను తినడానికి రావడంతో అమ్మకాలు బాగానే ఉన్నాయి. ముస్లింలతో పాటు ఇతరులు కూడా వీటిని తినడానికి ఇష్టపడటంతో హాట్ కేకుల్లా అమ్మకాలు సాగుతున్నాయి. హలీమ్ ప్లేట్ ధర రూ. 200, హరీస్ ప్లేట్ ధర రూ. 120 పలుకుతుంది.


కొత్తూరు జెండా ప్రాంతంలో హలీమ్, హరీస్‌లను వండుతున్న మాస్టర్



హనుమకొండ కేఎల్ఎన్ రెడ్డి కాలనీ వద్ద హరీస్, హలీమ్‌లను వండుతున్న మాస్టర్లు

‘ఏప్రిల్‌ను మహనీయుల మాసంగా జరుపుకోవాలి’

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి24 : ఏప్రిల్ నెలను మహనీయుల మాసంగా జరుపుకోవాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు పార్నంది రామయ్య పిలుపునిచ్చారు. మహబూబాబాద్‌లో ఆదివారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాజిక సమానత్వంకై పోరాడిన ముగ్గురు మహనీయుల జయంతులు ఏప్రిల్ నెలలోనే కావడం హర్షనీయమన్నారు. మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రామ్, సామాజిక విప్లవపురుషుడు మహాత్మాజ్యోతిరావు పూలె, భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌లు జయంతులు ఏప్రిల్‌లో ఉన్నందును మహనీయుల మాసంగా జరుపుకోవాలన్నారు. జిల్లా అధ్యక్షుడు మద్దెల వీరస్వామి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి ప్రభాకర్, సంఘం, బద్రినాయక్, దాసరి మహేందర్, గుగులోతు బాలు, మేడ వెంకటేశ్వర్లు, దేవ్‌సింగ్, కడారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముస్లిం కులసంఘం మండల కమిటీ ఎన్నిక


ఖాదర్ అధ్యక్షుడు

కేసముద్రం, మార్చి 24 : ముస్లిం ఉపకులాలతో ఏర్పాటు చేసిన కేసముద్రం మండల ముస్లిం కులసంఘం నూతన కమిటీని కేసముద్రం విలేజి మస్జీద్‌లో ఆదివారం ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా అర్పనపల్లికి చెందిన షేక్ ఖాదర్, గౌరవ సలహాదారులుగా ఎండీ.హఫీజ్, షేక్‌జావిద్, ఉపాధ్యక్షులుగా షేక్ మైబు సుబాని, సయ్యద్ ఖాదర్, మహ్మద్ యాకూబ్‌పాషా, షేక్ సర్వర్, ప్రధాన కార్యదర్శిగా షేక్ నయీం, సహాయ కార్యదర్శులుగా మహ్మద్ అంకూస్, ఎండి. గఫార్, షేక్ బాషుమియా, ఎండీ.యాకూబ్‌పాష, షేక్ అక్బర్‌లను నియమించారు.

వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

మహబూబాబాద్ రూరల్, మార్చి 24 : ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని తెలంగాణమాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు కొరిపల్లి శ్రీనివాస్ అన్నారు. మహబూబాబాద్ మండలం అయోధ్య గ్రామంలో జరిగిన నియోజకవర్గ స్థాయి సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి వందరోజుల్లో వర్గీకరణ చేస్తామని చెప్పిన మోదీ నేటికి ఆ హామీని అమలు చేయలేదని ఆరోపించారు. త్వరలో జరుగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తమసత్తా చాటుతామని హెచ్చరించారు. జిల్లా అధ్యక్షుడు జిలకర రవీందర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేష్, దాసరి పుల్లయ్య, వేణు, ఇద్దమ్మ, ఎల్లమ్మ, శ్రీలత, సుగుణమ్మ, పేరయ్య, వెంకటమ్మ, రమేష్ పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

కేసముద్రం, మార్చి 24 :కేసముద్రం విలేజిలో వ్యవసాయ పనులకు వెళుతున్న పెరుమాండ్ల వెంకన్నను కోరుకొండపల్లి గ్రామ అగ్రవర్ణానికి చెందిన వ్యక్తి కులంపేరుతో దూషించి, కర్రతో దాడిచేసిన ఘటనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు వల్లందాసు రవి డిమాండ్ చేశారు. కేసముద్రం విలేజిలో బాధితున్ని పరామర్శించిన అనంతరం ఆయన మాట్లాడుతూ 70 ఏళ్ల వృద్ధుడైన వెంకన్నపై దాడి చేయడం హేయనీయమని అన్నారు. నాగెల్లి శ్రీను, జల్లెంపల్లి శ్రీను, గద్దల యాకస్వామి, తుంపిళ్ల వెంకన్న, పొలెపాక రాజు, మిట్టగడుపుల యాకూబ్, రాంజీ పాల్గొన్నారు.

కన్నుల పండువగా శ్రీవేంకటేశ్వరుడి కల్యాణోత్సవం


శ్రీవేంకటేశ్వరుడి కల్యాణమహోత్సవం సందర్భంగా స్వామివారి, పద్మావతి, అలివేలుమంగల ఉత్సవవిగ్రహాలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 24 : మానుకోట మునిసిపాలిటీ పరిధిలోని అనంతాద్రి శ్రీస్వయంభూ జగన్నాథ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం కన్నులపండువగా జరిగింది. అనంతాద్రి దేవాలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం హేమంత్‌ఆచార్యుల యాజ్ఞిక నిర్వహణలో కల్యాణం జరిగింది. ప్రధాన అర్చకుడు గొడవర్తి చక్రధరాచార్యులు, శ్రావణ్‌కుమారాచార్యులు, విజయ్‌కుమారాచార్యుల వేద మంత్రోచ్చరణల నడుమ స్వామివారి కల్యాణం కమనీయంగా నిర్వహించారు. తొలుత సుప్రభాతసేవ, సేవాకాలం, నివేదిత వేదవిన్నపం, జీహాబెల్లం, మాంగళ్యధారణ, మాల మార్పిడి, వారణమయం, హారితి, తీర్థప్రసాదగోష్ఠి కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం 10 గంటలకు స్వామి కల్యాణ తంతును ప్రారంభించిన అర్చకులు మధ్యాహ్నం కల్యాణాన్ని జరిపించారు.

పులకించిన పోయిన భక్తులు..

శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని తిలకించడానికి భక్తులు జిల్లా కేంద్రం నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. ఆలయ ప్రాంగణమంతా భక్తులతో కిటకిటలాడింది. అంగరంగవైభవంగా జరిగిన స్వామివారి కల్యాణంను చూసిన భక్తులు పులకించి పోయారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. స్వామి వారికి కల్యాణానికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేసి, మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఆకట్టుకున్న మాలమార్పిడి..

శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం అనంతరం కల్యాణ ప్రాంగణంలో ఇరువైపుల కూర్చున్న భక్తులకు అర్చకులు బంతిపూలతో చేసిన మాలను ఒకవైపు నుంచి మరొకవైపునకు మార్చుకున్నారు. అత్యంత ఆనందోత్సాహాల మధ్య శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణమహోత్సవం కన్నుల పండుగగా జరిగింది. ఈ వేడుకల్లో ఆలయ ట్రస్ట్ ఛైర్మన్ నూకల రాంచంద్రారెడ్డి-జ్యోతి దంపతులు కమిటీ సభ్యులు నాయిని ప్రభాకర్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

శివపార్వతుల కల్యాణం..

మరిపెడ రూరల్ : హోలీ పౌర్ణమి సందర్భంగా ప్రతీ ఏటా శివపార్వతుల కల్యాణం జరిపిస్తారు. మండలంలోని ఉల్లేపల్లి శివారు భూక్యతండాలో వెలిసిన మల్లిఖార్జున స్వామి దేవాలయంలో శివపార్వతుల కల్యాణాన్ని వేద పండితులు ఆధ్వర్యంలో మంత్రోచ్చరణల నడుమ ఎలివారిగూడెంకు చెందిన క్లాస్ వన్ కాంట్రాక్టర్ రామడుగు అచ్యుత్‌రావు దంపతులు ఆదివారం పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం శివపార్వతుల కల్యాణం జరిపించారు. కల్యాణం అనంతరం వచ్చిన భక్తులు అందరు భోజనాలు స్వీకరించారు. మరిపెడ ఛైర్‌పర్సన్ గుగులోతు సింధూర కుమారి రవి, శ్రీరంగం శ్రీను, మాజీ సర్పంచ్ భూక్యా సేవియా, వీరమల్లు, గండి విష్ణు పాల్గొన్నారు.

మానుకోటలో అక్రమ నిర్మాణాల కూల్చివేత


కాలనీ వెనుకాల ప్రభుత్వ భూమిలో నిర్మించిన ఇంటిని కూల్చుతున్న దృశ్యం

మహబూబాబాద్ టౌన్, మార్చి23 : జిల్లా కేంద్రంలో ప్రభుత్వ భూమిలో నిర్మించిన అక్రమ నిర్మాణాలపై అధికారులు దృష్టి సారించారు. గత కొంతకాలంగా పోలీస్, రెవెన్యూ, మునిసిపల్ శాఖల అధికారులు సంయుక్తంగా దాడులుచేపట్టి కట్టడాలను కూల్చుతున్నారు. అందులో భాగంగానే ఆదివారం మానుకోట పట్టణంలోని ఆయాశాఖల అధికారులు సర్కార్ భూమిలో నిర్మించిన ఇళ్లను జేసీబీ సాయంతో కూల్చి వేశారు. కురవి రోడ్‌లోని కవిత కాలనీ వెనుకభాగంలో 255 సర్వేనెంబర్ ప్రభుత్వ భూమిలో ఉన్న మూడు ఇళ్ల, పాత కలెక్టరేట్ వెనుక భాగంలో 551 సర్వే నెంబర్ ప్రభుత్వ భూమిలో నిర్మించిన ఇల్లును కూల్చివేశారు.ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మాణాలు చేపడితే చట్టపరంగా చర్యలు తప్పవని తహసీల్దార్ భగవాన్‌రెడ్డి హెచ్చరించారు. ఎవరూ ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేపట్టవద్దని సూచించారు. టౌన్ సీఐ దేవేందర్, ఆర్ఐ కృష్ణప్రసాద్, సిబ్బంది శ్రీకాంత్, కృష్ణ పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా జిల్లా కమిటీ ఎన్నిక

మహబూబాబాద్ రూరల్, మార్చి 24 : భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అనుబంధ ఓబీసీ మోర్చా జిల్లా నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆసంఘం జిల్లా అధ్యక్షులు పైండ్ల శ్రీనివాస్ తెలిపారు. ప్రధాన కార్యదర్శులుగా చింతల శివకృష్ణ, గంధసిరి మధు, ఉపాధ్యక్షులుగా గట్టు రాంబాబు, రంగపురపు బిక్షపతి, సంపంగి జంపయ్య, కార్యదర్శులుగా దుబాకుల అశోక్, పూజారి రవి, వీరేందర్, కొణతం వెంకటేష్‌లను ఎన్నుకున్నట్లు చెప్పారు.

మండల అధ్యక్షుల ఎన్నిక..

మహబూబాబాద్ ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులుగా గోగుల దేవేందర్, కేసముద్రంకు ముత్యం ఉమేష్, నెల్లికుదురుకు బొమ్మరాజు నాగన్న, ఇనుగుర్తి మండలానికి తుమ్మనపల్లి పూర్ణాచారి, డోర్నకల్‌కు ఉడుగుల శ్రీనివాస్, సీరోలుకు వర్రె యాకయ్య, చిన్న గూడూరుకు నాగులపాటి శివయ్య, మరిపెడకు సొంటి రజినీకాంత్, నర్సింహులపేటకు జక్కి సాయి, కురవికి తాడబోయిన నాగరాజు, గార్లకు యంగల బుచ్చిబాబు, తొర్రూరు మండలానికి గుండా సురేష్, కొత్తగూడకు మామిడి యాకన్న, గంగారంకు సిద్దోజు ప్రకాష్, మహబూబాబాద్ టౌన్ మనుగొండ యాకన్న, డోర్నకల్ టౌన్ అధ్యక్షులుగా రెడ్డబోయిన భద్రంను ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఫీజు తగ్గించాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 24 : ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఫీజు తగ్గించాలని టీఎస్-యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మల్లారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌లోని సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపాధ్యాయ నియామకాలను చేపట్టే ముందు నిర్వహించే అర్హత పరీక్ష టెట్ ఫీజులను తగ్గించాలన్నారు. ఒక్కో పేపరుకు రూ.1000 బాధాకరమన్నారు. గత ప్రభుత్వంలో ఒక్కో పేపరుకు రూ.300 చొప్పున రెండుపేపర్లకు కలిపి రూ.600 ఉండగా ఈ ప్రభుత్వం రూ. 2000 లకు పెంచడం నిరుద్యోగులపై ఆర్థిక భారం పడుతుందన్నారు. వెంటనే ప్రభుత్వం ఫీజు పెంపుపై పునరాలోచన చేయాలని పేర్కొన్నారు. సర్వీస్‌లో ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయులకు పదోన్నతుల్లో టెట్ తప్పనిసరి చేసినందున ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా టెట్ నిర్వహించి పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మురళీకృష్ణ, యాకూబ్, నాగమల్లయ్య, వివేక్ పాల్గొన్నారు.

టూరిజం డెవలప్‌మెంట్ ఛైర్మన్‌ను కలిసిన అంజయ్య

మహబూబాబాద్ టౌన్, మార్చి 24 : సూర్యాపేటలో తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ మానుకోట అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య ఆదివారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఇటీవల టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన పటేల్ రమేష్‌రెడ్డిని సూర్యపేటలోని తన స్వగృహంలో కాంగ్రెస్ నేత అంజయ్య కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి విశేష కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఓబీసీ సెల్‌రాష్ట్రకో-ఆర్డినేటర్ పిండ్రాల రాందాసు, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కామ సంజీవరావు, బండారు వెంకటరమణ పాల్గొన్నారు.

జాతర్లకు నిధులు కేటాయించాలి

గంగారం, మార్చి 24 : ఆదివాసీ కోయ ఇలవేల్పు జాతర్లకు ప్రభుత్వం నిధులు కేటాయించాలని ఏటూరునాగారం ఐటీడీఏ పరిధి పెసా కమిటీ కోఆర్డినేటర్ కొమరం ప్రభాకర్ కోరారు. ఆదివారం గంగారంలో జరిగిన చింతా వారి ఇలవేల్పు కాసాలనాయుడు జాతర అనంతరం ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. మేడారంలో జాతర జరిగిన తర్వాత నుంచి ఉగాది పండుగ వరకు ఆదివాసీ గుడెలలో గొలుసుకట్టు జాతర్లు జరుగుతున్నాయని అన్నారు. ఈ జాతర్లకు ప్రభుత్వం బాధ్యతగా నిధులు కేటాయించి ఆదివాసీల మగుగడను కాపాడాలని కోరారు. తలపతి చింతా వజ్జయ్య, చింతా రవి, బూర్క యాదిగిరి, నిర్మల, సుజిత్, సర్వయ్య, ఈక సురేందర్, పర్శిక వీరస్వామి పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ కాలువలో ట్రాక్టర్ బోల్తా

- డ్రైవర్ అశోక్ మృతి



అశోక్ (ఫైల్)

కాలువలో పడిపోయిన ట్రాక్టర్

మహబూబాబాద్ రూరల్, మార్చి24 : జిల్లా కేంద్రంలోనిసబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సమీపంలో ఎస్సారెస్పీ కెనాల్ కాలువలోకి ప్రమాదవశాత్తు ట్రాక్టర్ దూసుకుపోయి పల్టీ కొట్టింది. ఈ ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్ అశోక్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని వడ్డెర కాలనీకి చెందిన చెన్నయ్య-సాయిమల్లమ్మ దంపతుల కుమారుడు ఆలకుంట్ల అశోక్(20) ట్రాక్టర్ నడుపుతూ.. కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ క్రమంలో శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు ట్రాక్టర్‌ను నడిపాడు. ఆపై 5 గంటల సమయంలో పనులు ముగించుకుని కెనాల్‌కాల్వ పక్కదారి వెంట ట్రాక్టర్‌పై ఇంటికి వెళ్తున్న సమయంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ అదుపు తప్పి కాల్వలోకి దూసుకుపోయి పల్టీ కొట్టింది. ఈ ఘటనలో అశోక్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు.

24.5 టన్నుల పీడీఎస్ బియ్యం పట్టివేత

- వీటి విలువ రూ.4లక్షల 90 వేలు


పోలీసులు స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యం లారీ

తొర్రూరు, మార్చి 24 : అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని సమాచారం మేరకు పట్టుకున్నట్లు ఎస్సై జగదీష్ తెలిపారు. ఆదివారం డివిజన్ కేంద్రంలో ఖమ్మం-వరంగల్ హైవేపై తనిఖీలు చేస్తుండగా, తొర్రూరు పట్టణ శివారులోని దుబ్బతండా వద్ద మహబూబాబాద్ నుంచి మహారాష్ట్రకు వెళ్లే ఎంహెచ్ 37 టీ 2176 నంబరు గల లారీలో తనిఖీచేయగా సుమారు 24.5 టన్నుల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించామన్నారు. వీటి విలుల సుమారు సివిల్ సప్లయీస్ అధికారుల అంచనా మేరకు రూ.4లక్షల 90వేలు ఉంటుందని ఉమ్మడి జిల్లాలోని నెక్కొండ, గూడూరు ప్రాంతాల గ్రామాల్లో సేకరించిన పీడీఎస్ బియ్యాన్ని మహారాష్ట్రకు తరలిస్తున్నారని తెలిపారు. సరుకు లోడ్ చేసిన వ్యక్తి మొబైల్ స్విచ్ ఆఫ్ అయిందని, మహారాష్ట్రలో బియ్యాన్ని దిగుమతి చేసుకునే వ్యక్తులను గుర్తించామని, వారి ఫోన్‌లు స్విచాఫ్ వస్తున్నాయని, డ్రైవర్ మనోద్ ధర్మదాస్ గులాడేపై కేసు నమోదు చేశామని తెలిపారు. బియ్యం రవాణాపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నామని, 2, 3 రోజుల్లో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు. ఈ తనిఖీల్లో ఎస్సై రాజు, సిబ్బంది మల్లేష్ తదితరులు ఉన్నారు.

బావిలో పడి పశువుల కాపరి మృతి


మృతి చెందిన వీరన్న

బయ్యారం, మార్చి 24 : ప్రమాదవశాత్తు బావిలోపడి పశువుల కాపరి మృతి చెందిన ఘటన ఆదివారం బయ్యారం మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు, బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం. వెంకట్రాంపురం గ్రామానికి చెందిన కందుకూరి వీరన్న (40) కొంత కాలం గా పశువుల కాపరిగా జీవనం సాగిస్తున్నాడు. రోజువారి మాదిరిగానే ఆదివారం కూడా వీరన్న పశువులను మేతకు తోలికెళ్లాడు. ఈ క్రమంలోనే జాఫరబాద సమీపంలోని ఓ వ్యవసాయ బావి వద్దకు పశువులను నీళ్లకు తోలికెళ్లిన క్రమంలో వీరన్న ప్రమాదవశాత్తు బావిలో జారిపడి మృతి చెందినట్లు తెలిసింది. వీరన్నకు భార్య నాగమణితో పాటు కూతురు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. కాగా, వీరన్న సొమ్మ (ఫీట్స్) వ్యాధితో బాధపడుతున్నట్లు సమాచారం.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


కంబాలపల్లి జడ్పీఎస్ఎస్ పూర్వ విద్యార్థులతో నాటి గురువులు

మహబూబాబాద్ టౌన్, మార్చి 24 : జిల్లా కేంద్రంలోని వర్తక సంఘం భవనంలో కంబాలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. కంబాలపల్లి బడిలో 1988-89 విద్యాసంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు 35 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకుని ఆనందం వ్యక్తం చేశారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని పాఠశాలలోని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అలనాడు విద్యాబుద్దులు నేర్పిన గురువులు విష్ణుమూర్తి, రాంనర్సయ్య, నారాయణరావు, కొమురయ్య, అంతయ్యలను శాలువాలతో సత్కరించారు. గురువులు నేర్పిన పాఠాలను శ్రద్ధగా విని ఉన్నత శిఖరాలను అధిరోహించామని, వారి సేవలను ఎన్నటికి మరువలేం అన్నారు. పూర్వ విద్యార్థులు నూకల సుధీర్‌రెడ్డి, జగన్, సత్యనారాయణ, జెన్నయ్య పాల్గొన్నారు.

నూతన జాతీయ విద్యావిధానం రద్దు చేయాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 24 : నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలని డెమొక్రటిక్ టీచర్ ఫెడరేషన్ (డీటీఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.లింగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌లో ఆదివారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి దిగజారిపోతోందని, బడుగు, బలహీనవర్గాలకు నాణ్యమైన విద్య నందించాలన్నారు. ఈ సమావేశంలో బాబు, కృష్ణమూర్తి, భీముడు, సుమన్, ఉపేందర్‌రెడ్డి, హరిశంకర్, దేవేందర్‌రాజు, లక్ష్మయ్య, కొట్టయ్య, మంగీలాల్, యాదగిరి, సురేందర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ‘అంతర్యామి’ ప్రారంభం

కేసముద్రం, మార్చి 24 : కేసముద్రం విలేజిలో కుల, మత రహితంగా అంత్యక్రియలకు చేయూత నందించే ‘అంతర్యామి’ స్వచ్ఛంద సేవా సంస్థను ఆదివారం ప్రారంభించారు. గ్రామానికి చెందిన వివిధ రంగాలు, వివిధ కుల, మతాలకు చెందిన 111 మంది సభ్యులతో ఈ సంస్థను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామ పరిధిలో ఎవరైనా మృతి చెందినట్లయితే సంస్థ సభ్యులు, నిర్వాహకుల దృష్టికి తీసుకువస్తే వారి కుటుంబానికి రూ.8వేల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేయనున్నారు. ఈ మేరకుఅవసరమైన సమయంలో తమ వాట్సాప్ గ్రూప్ ద్వారా విరాళాల సేకరణను అప్పటికప్పుడే ప్రతీ సభ్యుడు రూ.100 చొప్పున సేకరించే విధంగా తీర్మానం చేసుకున్నారు. తొలిరోజు గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన రంగోజు రుక్కమ్మ అంత్యక్రియలకు సహాయం అందించేందుకు పిలుపునివ్వగా నిమిషాల వ్యవధిలోనే రూ.8వేలు జమ అయినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు రుక్కమ్మ కుటుంబ సభ్యులకు తొలి సహాయాన్ని అందజేశారు. గ్రామంలో అంత్యక్రియలకు ఆర్థిక సహాయం అందజేశారు. అంతర్యామి సంస్థ ఏర్పాటుపై పలువురు గ్రామస్తులు నిర్వాహకులను అభినందిస్తున్నారు.

ఆదివాసీ జాతి భవిష్యత్తును కాపాడుతాను..

- తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ అభ్యర్థి మైపతి అరుణ్‌కుమార్

కొత్తగూడ, మార్చి 24 : ఆదివాసీ జాతి భవిష్యత్తును కాపాడే బాధ్యత తనదేనని, ఆదివాసీలు రాజకీయ పార్టీలకు అతీతంగా ఓటువేసి తనను ఎంపీగా గెలిపించాలని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు, మానుకోట ఎంపీ అభ్యర్థి మైపతి అరుణ్‌కుమార్ పిలుపునిచ్చారు. కొత్తగూడలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మానుకోట పార్లమెంట్ ఎన్నికల్లో కనీససామాజిక న్యాయం పాటించకుండా 4లక్షల ఓట్లు ఉన్న ఆదివాసీలకు రాజకీయ పార్టీలు టికెట్లు కేటాయించలేదని ఆరోపించారు. సమావేశంలో తుడుందెబ్బ రాష్ట్ర సాంస్కృతిక కార్యదర్శి ఆగబోయిన రవి, ఏఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుంజ నర్సింగరావు, మండల ఉపాధ్యక్షుడు సిద్దబోయిన లక్ష్మీనారాయణ, నాయకులు కుంజ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

కురుమ కార్పొరేషన్ ఏర్పాటు కోసం వినతి

కేసముద్రం, మార్చి 24 : కురుమ కులస్తుల అభివృద్ధి కోసం తమ సంఘానికి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ సంఘం నాయకులు హైదరాబాద్‌లో ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కార్పొరేషన్‌తో పాటు కమ్యూనిటీ హాలు నిర్మాణం కోసం సీఎం దృష్టికి తీసుకువెళ్తానని వేం వారికి హామీ ఇచ్చారు. జిల్లా అధ్యక్షుడు చీర అశోక్, గౌరవ అధ్యక్షుడు ముదిగిరి సాంబయ్య, ముఖ్య సలహాదారులు గౌండ్ల యాదగిరి పాల్గొన్నారు.


డోర్నకల్ పట్టణంలో ర్యాలీగా వస్తున్న క్రైస్తవులు


మానుకోటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎల్షాద్దాయ చర్చి పాస్టర్లు

జిల్లాలో ఘనంగా మట్టల ఆదివారం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి24 : జిల్లా కేంద్రంలో క్రైస్తవులు మట్టల ఆదివారాన్ని ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని వివిధ చర్చిల్లో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేసి, ఈత మట్టలతో పట్టణంలోని ప్రధాన రహదారులపై పాటలు పడుతూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బ్లెస్డ్ చర్చి మినిస్ట్రీ రెవరెండ్ ఫాదర్ డాక్టర్ ఎ.ప్రేమానంద్ మాట్లాడారు. ఏసు ప్రభువు జెరూసలెం పట్టణంలో ప్రప్రథమంగా ప్రవేశించినప్పుడు అక్కడి ప్రజలు ఏసు ప్రభువును గాడిదపై తీసుకొని వస్తూ, పెద్దఎత్తున వివిధరకాల మట్టల (చెట్లకొమ్మల)తో ఘనస్వాగతం పలికారని తెలిపారు. ఆనాటి నుంచి మట్టల పండుగగా ఆచరిస్తారని పేర్కొన్నారు. ఈ పర్వదినాన్ని గుడ్‌ఫ్రైడేకు ముందు వచ్చే ఆదివారం రోజున జరుపుకుంటారని, ఈ వారాన్ని పరిశుద్ధ వారంగా పరిగణిస్తారని తెలిపారు. ఫాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.

- డోర్నకల్ : డోర్నకల్ క్రైస్తవులు మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన వేడుకల్లో డోర్నకల్ సీఎస్ఐ చర్చి బిషప్ కోడిరెక్క పద్మారావు మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలు అందరు పాటించాలన్నారు. దేవుడి ఆశీర్వాదంతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. ఈ వేడుకల్లో బిషప్ సతీమణి విజయకుమారి, పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.
- గార్ల : మండల కేంద్రంలో సీఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో క్రైస్తవ సోదరులు మట్టల పండుగను జరుపుకున్నారు. అంబేద్కర్ నగర్ చర్చి నుంచి సంఘస్తులు, విద్యార్థులు ఈత మట్టలతో పట్టణంలోని పురవీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. నెహ్రూసెంటర్‌లో మానవహారం నిర్వహించి, ప్రార్థనలు జరిపారు. ఈ సందర్భంగా సీఎస్ఐ చర్చి పాస్టర్ జ్ఞానరాజ్ మాట్లాడారు. సంఘపెద్దలు యేసుమణి, రవితేజ, జోష్వ, దేవారాజు, గులగుట్టుబాబు, డేవిడ్, జాన్‌రాజ్, దేవా, కాగితపు ఎల్లయ్య, కాగితపు కల్యాణి, శాంతకుమారి, సంపత్, బన్నీ, మహేష్, సంఘస్తులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి రూ.2.16 లక్షల విరాళం

గూడూరు, మార్చి 24 : అయోధ్యపురంలో శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ నిర్మాణం కోసం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన మౌంటెన్ విప్రో ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆది శ్రీనివాస్ రూ.2.16 లక్షల విరాళం అందజేశారు. ఈ చెక్కును దేవాలయ నిర్మాణ కమిటీ సభ్యులకు ఆదివారం చెక్కును అందించారు. అందించారు. ఇల్లందుకు చెందిన రిటైర్డ్ సింగరేణి కార్మికుడు దండ సోమనర్సయ్య రూ.10016, పాల్వంచకు చెందిన అజ్మీర శ్రీనివాస్ రూ.5016, కొత్తగూడెంకు చెందిన బీరం జితేందర్‌రెడ్డి రూ.20001, అజ్మీర వెంకన్న రూ.10001 విరాళాలను కమిటీ సభ్యులకు అందజేశారు. వీరంతా అయోధ్యపురం గ్రామపంచాయతీకి చెందిన వారే కావడం విశేషం. ఈకార్యక్రమంలో కమిటీ సభ్యులు బీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డి, తులసీరాం, భూక్య వెంకన్న, ఆగిరెడ్డి, సీతారాంరెడ్డి పాల్గొన్నారు.

గ్రామదేవతల ఆలయాలకు..

మర్రిమిట్టలో గ్రామదేవతల ఆలయాల నిర్మాణం కోసం గూడూరుకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు, మండల విద్యాశాఖ నోడల్ అధికారి చీర బిక్షపతి రూ.2 లక్షల విరాళం అందించారు. మర్రిమిట్టలో బొడ్రాయి ప్రతిష్ఠించి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా బొడ్రాయికి వార్షికోత్సవం నిర్వహించారు. గ్రామంలో బొడ్రాయి, హనుమాన్ దేవాలయాల నిర్మాణం కోసం రూ.లక్షల విరాళం అందించిన చీర బిక్షపతిని బొడ్రాయి, హనుమాన్ ఆలయాల నిర్మాణ కమిటీ బాధ్యులు ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కూనెం ఎర్రయ్య, చెల్పూరి వెంకన్న, గుమ్మడి సుధాకర్, చెల్పూరి శ్రీశైలం, నాగరాజు, నగేష్, సునీల్, కుమారస్వామి సాంబయ్య, వీరస్వామి, సదయ్య రమేష్, చిట్టిబాబు, సంజీవ పాల్గొన్నారు.


మర్రిమిట్టలో రూ.2లక్షల విరాళం ఇచ్చిన చీర బిక్షపతిని సన్మానిస్తున్న ఆలయాల నిర్మాణ కమిటీ సభ్యులు

‘అరూరి’కే ఖరారు

(5వ పేజీ తరువాయి)

బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్‌తో బీజేపీ పెద్దలు సంప్రదింపులు జరిపారు. ఈ క్రమంలో బీజేపీలో చేరేందుకు అరూరి రమేష్ సుముఖత వ్యక్తం చేశారు. అయితే ఆరూరి బీజేపీలోకి వెళ్లకుండా బీఆర్ఎస్ తీవ్ర ప్రయత్నాలు చేసింది. ఒకదశలో బీఆర్ఎస్‌కు రాజీనామా చేసేందుకురమేష్ ప్రెస్‌మీట్ పెడితే.. అదేరోజు బీఆర్ఎస్ నేతలు ఎర్రబెల్లి దయాకర్‌రావు, బస్వరాజు సారయ్య, నాగుర్ల వెంకన్న రమేష్‌ను బలవంతంగా హైదరాబాద్‌కు తీసుకెళ్లి కేసీఆర్‌తో సమావేశం నిర్వహించారు. వరంగల్ ఎంపీ టికెట్ రమేష్‌కు ఇచ్చేందుకు కేసీఆర్ అంగీకరించినప్పటికీ పోటీకి ఆరూరి సుముఖత వ్యక్తం చేయలేదు. దీంతో వెంటనే కడియం కావ్య పేరును అధిష్ఠానం ప్రకటించింది. దీంతో పార్టీ మారటంపై అరూరి కొంత తర్జనభర్జనల తరువాత బీజేపీలో చేరేందుకు నిర్ణయం తీసుకున్నారు.రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సమక్షంలో ఈనెల 17న కాషాయ కండువా కప్పుకున్నారు. అనంతరం జిల్లాలో బీజేపీ ముఖ్యులను కలుస్తూ తనకు మద్దతు ఇవ్వాలని కోరుతూ వచ్చారు. అనుకున్నట్లుగానే ఆదివారం ఐదో జాబితాలో ఆరూరి రమేష్ పేరును అధిష్ఠానం ఖరారు చేయటంతో బీజేపీలో సంబరాలు వ్యక్తం అవుతున్నాయి.

రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా...

కాంట్రాక్టర్‌గా ఉన్న అరూరి రమేష్ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వర్ధన్నపేట నియోజకవర్గం నుంచి పోటీచేసి విజయం సాధించారు. రెండోసారి 2018లో కూడా భారీ మెజారిటీతో వర్ధన్నపేట నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఇదే సమయంలో వరంగల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడిగా రమేష్‌ను పార్టీ అధిష్ఠానం నియమించింది. అయితే 2023 ఎన్నికల్లో రమేష్ ఓటమిపాలయ్యారు. ఆ తర్వాత లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి వరంగల్ టికెట్ ఆశించిన అరూరికి అధిష్ఠానం నిరాశ మిగిలింది. దీనికి తోడు స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి.. తన కుమార్తెకు టికెట్ ఇప్పించుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని అరూరి గమనించారు. ఈక్రమంలో బీజేపీ నుంచి ఆఫర్ రాగానే పార్టీ మారారు. బీజేపీ అభ్యర్థిగా వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి పోటీకి దిగుతున్నారు.